

రాజీవ్‌నగర్‌లో పంపిణీకి నోచుకోని డబుల్ బెడ్రూం ఇళ్లు

నిరుపయోగంగా డబుల్ బెడ్రూం ఇళ్లు

- నిర్మాణం పూర్తయినా పంపిణీకి నోచని వైనం
- ఇందిరమ్మ పథకంతో అయోమయం
- డబుల్ ఇళ్ల ప్రస్తావన తీయని కాంగ్రెస్ సర్కారు
- ఆ ఇళ్లపై ఇప్పటికే పెద్ద మొత్తంలో ఖర్చు

మంచిర్యాల, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): సొంత ఇల్లు లేని నిరుపేదలకు ప్రభుత్వపరంగా పక్కా ఇల్లు నిర్మిస్తామని ప్రభుత్వాలు చెబుతున్నా అది క్షేత్ర స్థాయిలో అమలు కావడం లేదు. గత ప్రభుత్వ హయాంలో డబుల్ బెడ్రూం ఇళ్లు కట్టిస్తామన్న హామీ నెరవేరలేదు. పేదలకు పంపిణీ చేసేందుకు చేపట్టిన డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణం కొన్నిచోట్ల పూర్తయినా పంపిణీలో జాప్యం కారణంగా అవి అర్హులకు అందకుండా పోయాయి. అప్పటి అధికారులు, పాలకుల నిర్లక్ష్యం వల్ల కోట్లు వెచ్చించి నిర్మించిన ఇళ్లు ప్రస్తుతం నిరుపయోగంగా మారాయి. ప్రభుత్వం మారడం, కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో డబుల్ బెడ్రూం ఇళ్ల పరిస్థితి ఆగమ్యగోచరంగా తయారైంది. కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు ఇందిరమ్మ ఇళ్లు నిర్మిస్తామని ప్రకటించడంతో డబుల్ బెడ్రూం ఇళ్ల భవితవ్యం ప్రశ్నార్థకంగా మారింది.

నిర్మాణం పూర్తయినా...

జిల్లాలోని మంచిర్యాల, చెన్నూరు, బెల్లంపల్లి నియోజకవర్గాల పరిధిలో మొత్తం 2616 డబుల్ బెడ్రూం ఇండ్లు మంజూరయ్యాయి. వీటిలో మంచిర్యాల నియోజకవర్గానికి 685 మంజూరు కాగా 620 ఇళ్ల నిర్మాణం చివరి దశకు చేరుకుంది. చెన్నూరుకు 1146 మంజూరు కాగా వీటిలో మంద మర్రిలో 560, క్యాతన్‌పల్లి 286, చెన్నూరుకు 300 ఇండ్లు కేటాయించారు. వీటిలో 194 ఇళ్ల నిర్మాణం ప్రారంభం కాలేదు. మిగతా వాటిలో మంద మర్రిలో 160 ఇళ్లు 50 శాతం పూర్తికాగా, 400 ఇళ్లు చివరి దశలో ఉన్నాయి. బెల్లంపల్లి నియోజకవర్గానికి 585 ఇళ్లు మంజూరయ్యాయి. వీటిలో 170 ఇళ్ల నిర్మాణం కొనసాగుతుండగా 415 ఇళ్లకు సంబంధించి స్థలం వివాదం కొనసాగుతోంది. సర్కారు ఆదేశాలతో ఎట్టకేలకు డబుల్ ఇళ్ల పం పిణీ ప్రక్రియను ప్రారంభించారు. అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం డబుల్ బెడ్రూం ఇళ్లకు ఒక్కొక్కదానికి రూ.5.30 లక్షల అంచనాతో నిర్మాణం ప్రారంభించింది. జిల్లాలో మరో 806 ఇళ్ల నిర్మాణం చేపట్టవలసి ఉంది. తొమ్మిదేళ్ల కాలంలో జిల్లా వ్యాప్తంగా కేవలం 1044 ఇళ్లు పూర్తికాగా జిల్లా కేంద్రం మినహా మరెక్కడా లబ్ధిదారులకు పంపిణీ చేయలేదు.

లబ్ధిదారులను ఎంపిక చేసినా

రెండు పడక గదుల ఇండ్ల కేటాయింపునకు సంబంధించి లబ్ధిదారుల ఎంపిక పూర్తయింది. మొదటి విడుతలో జిల్లా కేంద్రంలో మంజూరైన 620 గృహాలను అర్హులకు కేటాయించేందుకు అప్పటి కలెక్టర్ భారతీ హోళికేరి ఆదేశాల మేరకు ప్రాథమిక విచారణ ప్రారంభించారు. మీ -సేవ ద్వారా అందిన 2,958 దరఖాస్తులను పరిశీలించిన అధికారులు వార్డుల వారీగా ప్రాథమిక జాబితాను తయారు చేసి గతేడాది ఆగస్టు 29న మున్సిపల్, తహసీల్దార్ కార్యాలయాల్లో ప్రదర్శించారు. ప్రాథమిక జాబితా పట్ల వచ్చే ఆక్షేపణలను పరిగణలోకి తీసుకొని తుది జాబితా విడుదల చేయనున్నట్లు అధికారులు ప్రకటించారు. అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ సంక్రాంతి పండుగకు అర్హులైన లబ్ధిదారులకు డబుల్ బెడ్రూం ఇళ్లు పంపిణీ చేయాలని ఆదేశించడంతో అధికారులు ఉరుకులు, పరుగులు అందుకున్నారు. అయినా పూర్తి స్థాయిలో ఇళ్ల పంపిణీ జరుగలేదు.



తహసీల్దార్ కార్యాలయం వద్ద టోకెన్ల కోసం బారులు తీరిన మహిళలు (ఫైల్)

రెండు విడుతల్లో 360 ఇళ్లు పంపిణీ

మంచిర్యాల మున్సిపాలిటీకి సంబంధించి మంజూరైన 620 గృహాల్లో నుంచి రెండు విడుతల్లో 360 ఇళ్లు మాత్రమే పంపిణీకి నోచుకున్నాయి. మంచిర్యాల మున్సిపాలిటీకి సంబంధించి మొత్తం 2958 మంది డబుల్ బెడ్రూం ఇళ్లకు దరఖాస్తు చేసుకోగా, అధికారులు 1621 మందిని అర్హులుగా తేల్చారు. వారికి టోకెన్లు అంద జేయడంతో లక్కీ డ్రాకు హాజరయ్యా రు. అయితే కేవలం 330 ఇళ్లను డ్రా ద్వారా లబ్ధిదారులకు అందజేసిన అధికారులు మిగతా నిర్మాణాల విషయంలో ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడంతో తుది జాబితాలో చోటు సంపాదించుకున్న అర్హులు తీవ్ర అయోమయానికి గురవుతున్నారు.

'ఇందిరమ్మ' వర్తించేనా...?

జిల్లా కేంద్రంలోని రాజీవ్‌నగర్‌లో 2007-08లో అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ పథకం కింద సర్వే నంబర్ 345లో నివేశన స్థలాలు పంపిణీ చేసింది. ఈ మేరకు ఎంపిక చేసిన లబ్ధిదారులకు రెవెన్యూ అధికారులు పట్టాలు జారీ చేసి 75 గజాల చొప్పున స్థలాలనూ అప్పగించారు. మంచిర్యాల మున్సిపాలిటీ పరిధిలోని అప్పటి 32 వార్డుల్లో 22 వార్డులకు చెందిన సుమారు మూడు వేల మందికి ఇళ్ల స్థలాలు పంపిణీ చేశారు.

వాటిలో దాదాపు 80 శాతం మంది లబ్ధిదారులు రూ.50 వేల నుంచి లక్ష వరకు ఖర్చుచేసి బేస్మెంట్లు, పిల్లర్లు నిర్మించుకున్నారు. మరికొందరు ఆర్థిక పరిస్థితుల కారణంగా స్థలాలను ఖాళీగా వదిలివేశారు. స్థోమత ఉన్న వారు ఆ స్థలాల్లో ఇండ్లు నిర్మించుకొని నివాసం ఉంటున్నారు. ఆ తరువాత ప్రభుత్వం మారి ఇందిరమ్మ పథకం మరుగున పడగా, బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చిన తరువాత డబుల్ బెడ్రూం ఇళ్ల విషయం తెరమీదకు వచ్చింది. దీంతో 2019-20 మధ్యకాలంలో అధికారులు సర్వే నంబర్ 345లో వెలసిన నిర్మాణాలను కూల్చివేశారు. దీంతో వారి పరిస్థితి దయనీయంగా మారింది. లబ్ధిదారులు తమ వద్ద ఉన్న ఆధారాలతో ఆందోళనకు దిగడంతో అధికారులు వారితో సంప్రదింపులు జరిపారు.

స్థలాలు కోల్పోయిన వారిని డబుల్ బెడ్రూం ఇళ్లకు ఎంపిక చేస్తామని, ప్రస్తుతం ఉన్న కట్టడాలను తొలగించి అదే ప్రాంతంలో డబుల్ ఇల్లు నిర్మిస్తామని అధికారులు హామీ ఇచ్చారు. అయితే డబుల్ బెడ్రూం ఇళ్లలోనూ వారికి మొండి చేయి చూపారు. ప్రస్తుతం ఇందిరమ్మ పథకం మళ్లీ తెరపైకి రావడం, గతంలో ఎమ్మెల్సీ హోదాలో పట్టాలు పంపిణీ చేసిన కొక్కిరాల ప్రేంసాగర్‌రావు ఎమ్మెల్యేగా ఉండటంతో తమకు ఇందిరమ్మ పథకంలో తిరిగి అవకాశం కల్పిస్తారని బాధితులు ఆశిస్తున్నారు.

అయోధ్య పూజిత అక్షింతల శోభాయాత్ర



కోటపల్లిలో శోభాయాత్ర నిర్వహిస్తున్న భక్తులు



మంగళ హారతులు ఇస్తున్న మహిళలు

కోటపల్లి, జనవరి 1: కోటపల్లి మండల కేంద్రంలో సోమవారం అయోధ్య పూజిత అక్షింతల శోభాయాత్రను భక్తులు వైభవంగా నిర్వహించారు. పల్లకిలో అక్షింతల కలశంతో పాటు, రాముని చిత్రపటంతో పల్లకి సేవ చేపట్టారు. మహిళలు మంగళ హారతులతో వచ్చి ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు శోభాయాత్రలో కోలాటాలు నిర్వహించగా భక్తులు, చిన్నారులు కాషాయ జెండాలతో నృత్యాలు చేశారు. అనంతరం ఆంజనేయ స్వామి ఆలయంలో పూజల నిర్వహించారు. అధిక సంఖ్యలో గ్రామస్థులు పాల్గొన్నారు.

మంచిర్యాల కలెక్టరేట్: అయోధ్య శ్రీరాముడి అక్షింతలను చున్నంబట్టివాడలో ఇంటింటా శోభాయాత్ర నిర్వహించారు. భక్తాంజనేయ శివ పంచాయతన నవగ్రహ దేవాలయం నుంచి అక్షింతలను ఇంటింటికి తీసుకెళ్లగా మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు. విశ్వహిందూ పరిషత్ తెలంగాణ రాష్ట్ర సంఘటన అధ్యక్షుడు ముడుపు యాదిరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. జిల్లా సంయోజక్ విశ్వస్వర శర్మ, వీహెచ్‌పీ జిల్లా కార్యదర్శి వేముల రమేష్, ఆర్ఎస్ఎస్ జిల్లా కార్యదర్శి పర్వతాలు నరసయ్య, నాయకులు సదానందం, బాపు, శంకరయ్య, రాజు పాల్గొన్నారు.

ఘనంగా హన్మాన్ మందిరం వార్షికోత్సవం

భీమారం, జనవరి 1: పోతనపల్లి హన్మాన్ మందిరం మూడో వార్షికోత్స వాన్ని సోమవారం ఘనంగా నిర్వహిం చారు. హోమం, తదితర పూజలు చేశారు. గ్రామస్తులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఉప్మమల్ల సాంబశివఅర్చన, శ్రీనివాస్, పున్నంచంద్ దంపతులు, పాల్గొన్నారు.



పూజలు నిర్వహిస్తున్న భక్తులు

ఘనంగా నూతన సంవత్సర వేడుకలు



కలెక్టర్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న అధికారులు

మంచిర్యాల కలెక్టరేట్, జనవరి 1 : జిల్లా కేంద్రంలో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. గతేడాది మిగిల్చిన జ్ఞాపకాలతో సరికొత్త ఆలోచనలతో ఆటా, పాటలు సంబరాలతో 2024కు స్వాగతం పలికారు. యువత కేరింతలు కొడుతూ కేక్‌లు కట్ చేస్తూ కొత్త సంవత్సరాన్ని వేడుకగా నిర్వహించారు. మహిళలు సంబరాల అనంతరం వాకిళ్లను రంగురంగుల ముగ్గులతో తీర్చిదిద్దారు. విశ్వనాథ ఆలయం, రాంనగర్ హన్మాన్ దేవాలయం, సాయిబాబా, వేంకటేశ్వర ఆలయాల్లో నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు దత్తాచార్య, నరహరిశర్మ, లక్ష్మణాచార్యులు, తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్ బదావత్ సంతోష్‌కు సోమవారం జిల్లా అధికారులు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ప్రభుత్వ పథకాలు ప్రజలకు చేరేందుకు అధికారులు అంకితభావంతో పనిచేయాలని, జిల్లా అభివృదికి కృషి చేయాలన్నారు. జెడ్పీ సీఈవో లక్ష్మినారాయణ, ఎంపీడీవో అహ్మద్‌ఫైౖ, శ్రీపతిబాపు పాల్గొన్నారు.

ఏసీసీ: రామగుండం పోలీస్ కమిషనరేట్‌లో సోమవారం నూతన సంవత్సర వేడుకలను సీపీ రెమా రాజేశ్వరి ఆధ్వర్యంలో నిర్వహించారు. కేక్ కట్ చేసిన అనంతరం సీపీ మాట్లాడుతూ కొత్త సంవత్సరంలో నూతన లక్ష్యాలను నిర్దేశించుకొని పని చేయాలని అధికారులను సూచించారు. 2023లో పోలీస్ శాఖ నూతన సాంకేతికతను, అధునాతన పద్ధతులను అవలంభించి కొత్త ఒరవడికి శ్రీకారం చుట్టిందన్నారు. పోలీసులు నిత్యం ప్రజల మధ్యలో ఉంటూ చట్ట పరిధిలో వారి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. ప్రజలతో సత్సంబంధాలు కలిగి ఉండాలన్నారు. గత సంవత్సరం జరిగిన అసెంబ్లీ ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించడంలో కృషి చేసిన అధికారులను అభినందించారు. రాబోయే పార్లమెంటు ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని సూచించారు. మంచిర్యాల డీసీపీ సుధీర్ రామ్‌నాథ్ కేకన్, మంచిర్యాల, జైపూర్, బెల్లంపల్లి ఏసీపీలు తిరుపతి రెడ్డి, మోహన్, సదయ్య సీఐలు, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా కేంద్రంలోని టీఎన్‌జీవో భవన్‌లో జిల్లా అధ్యక్షుడు గడియారం శ్రీహరి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి వేడుకలు చేశారు. కార్యదర్శి రామ్‌మోహన్, నాయకులు బాపు, పొన్నం మల్లయ్య, సునీత తదితరులు పాల్గొన్నారు.

దండేపల్లి: మండల ప్రజలు నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయా గ్రామాలలో ప్రజాప్రతినిధులు, నాయకులు కేక్ కట్ చేశారు. పిల్లలు, పెద్దలు వేడుకలను జరుపుకుంటూ కేక్ కట్ చేసి 2024కి స్వాగతం పలికారు. చర్చిల్లో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పలు చర్చి ప్రాస్టర్లు యేసుక్రీస్తు బైబిల్ సందేశంను చదివి వినిపించారు. మహిళలు ఇండ్ల ముందు రంగు రంగులతో ముగ్గులు వేశారు.

గూడెం సత్యనారాయణ స్వామితోపాటు పలు ఆలయాల్లో సోమవారం భక్తుల సందడి నెలకొంది. వందలాది మంది భక్తులు సత్యదేవున్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. పిల్లలపాపలను, కుటుంబసభ్యులను సుఖ సంతోషాలతో ఉంచాలని పూజలు చేశారు. భక్తులు సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలను ఆచరించారు.

వేమనపల్లి: మండలంలో యువతీ యువకులు నూతన సంవత్సర వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఆదివారం అర్థరాత్రి కేక్‌లు కట్ చేసి ఒకరికకొకరు తినిపించుకొని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. 2024 నూతన సంవత్సరానికి స్వాగతం పలికారు.

మందమర్రి టౌన్: పట్టణంలో నూతన సంవత్సరం వేడుకలను ఆయా కుల సంఘాలు, కార్మిక సంఘాలు ఘనంగా నిర్వహించారు. ప్రధాన కూడళ్లలో కేక్‌లు కట్ చేసి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. మహిళలు వాకిళ్లలో రంగవల్లులు వేసి కొత్త సంవత్సరానికి స్వాగతం పలికారు.కాంగ్రెస్, బీఆర్ఎస్, సీపీఐ పార్టీల నాయకులు, గనులు, విభాగాలలో సంబరాలు చేసుకున్నారు.



కేక్ కట్ చేస్తున్న సీపీ రెమా రాజేశ్వరీ



న్యూ ఇయర్ వేడుకల్లో మహిళలు



ఇంటి ఎదుట రంగవల్లులు



గూడెం ఆలయంలో భక్తుల రద్దీ

గుడిపేట బెటాలియన్ అధికారులకు సేవా పతకాలు

హాజీపూర్, జనవరి 1: మండలంలోని 13వ బెటాలియన్ పోలీసు అధికా రులకు పలు సేవా పతకాలు లభించాయి. రాష్ట్ర ప్రభుత్వం గణతంత్ర దినోత్సవం సందర్భంగా అందించే ఉత్తమ సేవా పతకం విభాగంలో అసిస్టెంట్ కమాండెంట్ రఘునాథ్ చౌహాన్, ఆర్ఐ సీహెచ్ రవి, ఎఆర్ఎస్ఐలు నారాయణరెడ్డి, జి. కొమురయ్య, కఠిన సేవా పతకం విభాగంలో ఆర్ఐలు జి.శ్యాంరావు, ఎ.గోపిలకు పతకాలకు ఎంపికయ్యారు.



రఘునాథ్ చౌహాన్, రవి, నారాయణ రెడ్డి, శ్యాంరావు, కొమురయ్య, గోపి

రామగుండం కమిషనరేట్‌లో..

కోల్‌సిటీ: రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఆరుగురికి పోలీస్ సేవా పతకాలు లభించాయి. ఈ మేరకు ప్రభుత్వం సోమవారం జీఓ నెం.91ని జారీ చేసింది. ఏఆర్ఎస్ఐ కాంపెల్లి లింగయ్య, మంచిర్యాల ట్రాఫిక్ ఎస్ఐ నీరటి రామరాజు, తాళ్లగురిజాల ఏఎస్ఐ మామిడి రాజన్న, పెద్దపల్లి ట్రాఫిక్ హెడ్ కానిస్టేబుల్ నీర్ల వేణుగోపాల్, లక్సెట్టిపేట హెడ్ కానిస్టేబుల్ ఇష్తాకర్ అహ్మద్, దండేపల్లి హెడ్ కానిస్టేబుల్ అజ్మీర గంగ్యానాయక్‌లు ఈ పతకాలకు ఎంపికయ్యారు. వీరికి రూ.20వేల ప్రోత్సాహకం లభిస్తుంది.

ముగిసిన వాలీబాల్ పోటీలు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న వెంకటాపూర్ సర్పంచ్

కాసిపేట, జనవరి 1: వెంకటాపూర్‌లో జరిగిన మండల స్థాయి వాలీబాల్ పోటీలు సోమవారం ముగిశాయి. రెండురోజుల పాటు జరిగినపోటీల్లో వెంటాపూర్ జట్టువిజేతగా, ద్వితీయస్థానంలో లక్ష్మీపూర్ నిలిచింది. గెలుపొందిన వారికి నగదుతోపాటు మెమోంటాలను సర్పంచ్ చేతులమీదుగా అందజేశారు.సర్పంచ్ సౌందర్య మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని, యువత క్రీడలపై ఆసక్తి చూపాలన్నారు. ఆడె శంకర్, ఆత్రం శేఖర్, తిరుపతి, శ్రీనివాస్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

దుర్గంధంగా ఆశ్రమ పాఠశాల పరిసరాలు

- రోజుల తరబడి నిలిచి ఉంటున్న మురుగునీరు
- పట్టించుకోని అధికారులు
- విద్యార్థినులకు తప్పని ఇబ్బందులు



గిరిజన ఆశ్రమ పాఠశాల ఎదుట నిలిచిఉన్న మురుగు నీరు

వాంకిడి, జనవరి 1: మండల కేంద్రంలోని గిరిజన బాలికల ఆశ్రమోన్నత పాఠశాల ఎదుట మురుగునీరు నిలిచి దుర్గంధంగా వెదజల్లుతోంది. మండల కేంద్రంలో నిర్మిస్తున్న నాలుగు వరుసల రోడ్డు నిర్మాణంతో పాటు డ్రైనేజీ నిర్మాణం పనులను ఎన్‌హెచ్ఏఐ అధికారులు చేపట్టాల్సి ఉంది. రోడ్డు పనులు చేపడుతున్న సంబంధిత అధికారులు డ్రైనేజీ పనులను పాఠశాల వరకు నిర్మించి వదిలేశారు. దీంతో 8నెలల నుంచి పాఠశాల నుంచి బయటికి వెళ్లా ల్సిన మురుగునీరు పాఠశాల ఎదుటే నిలిచిపోతోంది. దీంతో పాఠశాల పరిసర ప్రాంతమంతా దుర్గంధంగా వెదజల్లుతోంది. మురుగు నీటిలో దోమలు వ్యాప్తి చెందుతున్నందున పాఠశాలకు సమీపంలో ఉన్న విద్యార్థినుల వంటశాల, డైనింగ్‌రూంకు దోమలు వ్యాప్తి చెందుతున్నాయి. దీంతో వ్యాధులు ప్రబలే అవకాశాలు ఉన్నా యని విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. మురుగు నీటి దుర్వాసనతో పాఠశాల ప్రధానగేటు వద్ద నిలబడ లేక పోతున్నామని విద్యార్థినులు వాపోతున్నారు.

- ఎవరూ పట్టించుకోవడం లేదు
శ్రీనివాస్, పాఠశాల హెచ్ఎం



పాఠశాల ఎదుట కొంతకాలంగా మురుగునీరు నిలిచిఉంటోంది. దీంతో విద్యా ర్థినులు తీవ్రఇబ్బందులు పడుతున్నారు. దీంతో దోమలు వ్యాప్తిచెంది రోగాలు ప్రబలే అవకాశాలు ఉన్నాయి. ఎన్‌హెచ్ఏఐ అధికారులు రోడ్డుపక్కన డ్రైనేజీ నిర్మించక పోవడంతో పాఠశాల నుంచి మురుగు నీరు బయటకు పోవడం లేదు. డ్రైనేజీ నిర్మిం చాలని ఎన్‌హెచ్ఏఐ అధికారులకు, స్థానిక ప్రజా ప్రతినిధు లకు విన్నవించినా ఎవరూ స్పందించడంలేదు.

గ్యారంటీ పథకాల కోసం ప్రజల పరేషాన్

● ఆధార్ అప్‌డేట్ కోసం మీసేవ కేంద్రాలకు పరుగులు

● పట్టించుకోని అధికారులు



కాసిపేట ఆధార్ కేంద్రం వద్ద ఉన్న ప్రజలు

కాసిపేట, జనవరి 1: అభయహస్తం ఆరు గ్యారంటీల అమలులో భాగంగా తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన దరఖాస్తులో ఆధార్‌కార్డుపై అనేక అనుమానాలు తలెత్తుతున్నాయి. దీంతో ప్రజలు మీసేవ కేంద్రాలకు పరుగులు తీస్తున్నారు. పథకాలకు ఆధార్ కార్డు జిరాక్స్ జత చేయాలనే నిబంధన ఉంది. మహాలక్ష్మీ, రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, గృహజ్యోతి, చేయూత పథకాలు పొందేందుకు ఆధార్, మీ సేవ కేంద్రాల వద్ద క్యూ కడుతున్నారు. వారి అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకున్న మీ సేవ నిర్వహకులు డబ్బులు దండుకుంటున్నారు. సరైన పత్రాలు జత చేయకుంటే పథకాలకు అర్హులం కాదేమోననే అనుమానంతో అవసరం లేని పత్రాల కోసం జనం జేబులు గుల్ల చేసుకుంటున్నారు.

-కులం, ఆదాయం సర్టిఫికెట్లు

ఐదు గ్యారంటీ పథకాల కోసం దరఖాస్తు చేసుకునే లబ్ధిదారులకు కులం, ఆదాయం, నివాస పత్రాలు అవసరం లేదు. కానీ కొందరు దళారులు ప్రజల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని సొమ్ము చేసుకుంటున్నారు. ధ్రువీకరణ పత్రాలు సక్రమంగా ఉంటేనే పథకాలు అందుతాయని ప్రచారం చేస్తూ డబ్బులు దండుకుంటున్నారు. దీంతో ప్రజల జేబులు గుల్లవుతున్నాయి. కులం సర్టిఫికెట్ పొందేందుకు ఇద్దరు గెజిటెడ్ ఆఫీసర్ల సంతకాలతో పాటు లాయర్ నోటరీ సర్టిఫికెట్ జత చేయాల్సి ఉంటుంది. ఫారాల ఖర్చుతోపాటు వెయ్యి రూపాయల వరకు ఒక దరఖాస్తుదారుడు ఖర్చు చేస్తున్నారు. దీంతో ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఆధార్ తప్పనిసరి చేయడంతో జిల్లా, చిరునామా, ఇంటి పేర్ల మార్పు కోసం ఆధార్ కేంద్రాల చుట్టూ తిరుగుతున్నామని కొందరు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

-కొరవడిన అవగాహన సదస్సులు

ఐదు గ్యారంటీల దరఖాస్తుల కోసం ప్రజలకు దరఖాస్తు చేసుకునే విధానంపై ముందుగా అవగాహన కల్పించాలి. కానీ ప్రభుత్వం అలాంటి చర్యలు తీసుకోకపోవడంతో ప్రజలకు అనేక అనుమానాలు తలెత్తుతున్నాయి. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

రెండు రోజుల నుంచి తిరుగుతున్నా

ఆత్రం లస్మ,తిర్మలాపూర్



ఆధార్‌కార్డులో పుట్టిన రోజు, జిల్లా మార్చాలని చెప్పడంతో మీ సేవ కేంద్రానికి వచ్చాను. ఎవరు పట్టించుకోవడం లేదు. ఎలా మార్చుకోవాలో తెలియడం లేదు. ఇబ్బందులు పడుతున్నాం. అధికారులు తమను పట్టించుకుని తమకు ఇబ్బందులు లేకుండా దరఖాస్తు చేసుకునేలా చూడాలి

ఆధార్ అప్‌డేట్ అవసరం లేదు

సబావత్ మోతిలాల్, జాయింట్ కలెక్టర్ మంచిర్యాల



అభయహస్తం ఐదు గ్యారంటీల కోసం దరఖాస్తు చేసుకునే లబ్ధిదారులకు ఆధార్ అప్‌డేట్ అవసరం లేదు. దరఖాస్తు ఫారానికి ఆధార్‌కార్డు,రేషన్ కార్డు జిరాక్స్ జత చేస్తే సరిపోతుంది. ఎవరైనా ఆధార్, మీ సేవ కేంద్రాల నిర్వాహకులు ప్రజలను తప్పుదోవ పట్టిస్తే వారిపై చర్యలు తీసుకుంటాం. ప్రజలను ఇబ్బందులకు గురి చేయవద్దు. అధికారులు ప్రజలకు ఈ విషయాలపై అవగాహన కల్పించాలి.

రోడ్డు ప్రమాదంలో తల్లీకూతురు మృతి

నూతన సంవత్సర వేళ విషాదం




మృతి చెందిన నిర్మల, స్వాతి

కాసిపేట, జన వరి 1: సోమ గూడం కల్వరి చర్చిలో నిర్వ హించే నూతన సంవత్సర వేడు కల్లో పాల్గొనేం దుకు వచ్చిన తల్లి కూతుళ్లను రోడ్డు ప్రమా ద రూపంలో మృత్యువు కబళించింది. కొత్త సంవత్సర వేడుకలకు చర్చికి వెళ్తున్నామని చెప్పి వచ్చిన తల్లి కూతుళ్ల ప్రాణాలు అనంతలోకాల్లో కలిసి పోయాయి. దేవుడి ప్రార్థనలో ఉండాల్సిన వారు, విగత జీవులుగా మారిన నిర్మల, స్వాతిల మృతదేహాలను చూసి రోదనలు మిన్నంటాయి. నస్పూర్ సింగరేణి రిటైర్‌మెంట్ కాలనీలో అద్దెకు ఉంటున్న వేల్పుల నిర్మల (44) వేల్పుల స్వాతి (22) ఆదివారం సాయంత్రం కల్వరీ చర్చిలో ప్రార్థనల్లో పాల్గొనేందుకు వచ్చారు. వాహనం దిగి చర్చిలోనికి వెళ్లేందుకు కూతురు చేయి పట్టుకొని తల్లి రోడ్డు దాటుతుండగా మంచిర్యాల నుంచి వేగంగా వస్తున్న గూడ్స్ వ్యాన్ ఢీకొట్టడంతో వారు చెల్లాచెదురుగా పడిపోయారు. తలకు తీవ్ర గాయాలు కావడంతో ఇద్దరూ అక్కడికక్కడే ప్రాణాలు వదిలారు. రాత్రి 9గంటల ప్రాంతంలో ప్రమాదం జరగడంతో వీరికి సంబం ధించిన వివరాలు లభించలేదు. వారి వద్ద ఉన్న బతుకమ్మ చీరల కార్డు ఆధారంగా వారి అడ్రస్ తెలుసుకొని కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. బెల్లంపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం అనంతరం సోమవారం మృతదేహాలను కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతు రాలు నిర్మల భర్త రవీందర్ ఎస్అండ్‌పీసీలో విధులు నిర్వహిస్తున్నారు. కొడుకు రాజేశ్ హైదరాబాదు ఎంబీబీఎస్ చదువుతుండగా, మృతురాలు స్వాతి బీటెక్ చదువుతోంది. భర్త రవీందర్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గంగారం తెలిపారు. కాగా వీరి అంత్యక్రియలను నిర్మల తల్లిగారిల్లు అయిన గోదావరిఖనిలో నిర్వహించినట్లు తెలుస్తోంది.

వాంకిడి ఏఎస్ఐ పోశెట్టికి ఉత్తమసేవా పథకం



ఏఎస్ఐ పోశెట్టి

వాంకిడి, జనవరి 1: వాంకిడి పోలీస్ స్టేషన్‌లో పని చేస్తున్న ఏఎస్ఐ గంజే వార్ పోశెట్టికి రాష్ట్ర ఉత్తమ పోలీసు సేవా పథకాన్ని రాష్ట్ర పోలీస్ శాఖ ప్రకటించింది. విధి నిర్వహణలో ఉత్తమసేవలు అం దించి నందుకు గాను ఈ ఏడాది కుమరం భీం జిల్లా నుంచి వాంకిడి పోలీస్‌స్టేషన్‌లో పని చేస్తున్న ఏఎస్ఐ పోశెట్టికి రాష్ట్ర పోలీసుశాఖ ఉత్తమ పోలీసు సేవాపథకంను అందించింది. రాష్ట్రపోలీసు ఉత్తమసేవా పథకం అందుకున్న ఏఎస్ఐని వాంకిడి సీఐ శ్రీనివాస్, ఎస్సై సాగర్ ఈ సందర్భంగా అభినందించారు.

ఆర్టీసీ బస్సును పునరుద్ధరించాలి

వేమనపల్లి, జనవరి 1: బెల్లంపల్లి నుంచి కన్నెపల్లి, జిల్లెడ, వేమనపల్లి మీదుగా చెన్నూరుకు వెళ్లే ఆర్టీసీ బస్సు వారం రోజుల నుంచి రద్దు కావడంతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వం మహిళలకు బస్సుల్లో ఉచితంగా ప్రయాణించే వెసలుబాటు కల్పించినప్పటికి బస్సు రద్దు కావడంతో మహిళా ప్రయాణికులు ప్రైవేటు వాహనాల్లో పట్టణాలకు వెళ్లాల్సి వస్తోంది. రోడ్డు కూడా బాగున్నప్పటికి బస్సును అర్ధాంతరంగా రద్దు చేయడంతో సమంజసం కాదని మహిళలు అంటున్నారు. ఇప్పటికైన బస్సు పునరుద్ధరించి తమకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

భారీగా బెల్టుషాపులు

మందమర్రిటౌన్, జనవరి 1: ఇటీవల ప్రభుత్వం బెల్టు షాపులు తొలగించాలని నిర్ణయం తీసుకున్న నేపథ్యంలో వాటి వివరాలు సేకరించే పనిలో పోలీసులు నిమగ్నమయ్యారు. మండల వ్యాప్తంగా బెల్టుషాపుల వివరాలను పోలీసులు సేకరించినట్లు సమాచారం. పోలీసులు వివరాలు సేకరించగా 80కి పైగా బెల్టుషాపులు ఉన్నట్లు తెలిసింది. దీంతో కొందరు బెల్టుషాపుల యాజమానులు స్వచ్ఛందంగా మూసివేస్తున్నట్లు తెలుస్తుంది.

ప్లాస్టిక్ రహిత మున్సిపాలిటీకి చర్యలు

● ప్లాస్టిక్‌తో పొంచి ఉన్న ముప్పు

● అవగాహన కల్పిస్తే మేలు



కాగజ్‌నగర్, జనవరి 1: ప్లాస్టిక్ రహిత పట్టణంగా కాగజ్‌నగర్ మున్సిపాలిటీ అడుగులు వేస్తోంది. కాగజ్‌నగర్ మున్సిపాలిటీలో ప్లాస్టిక్ కవర్లు, సంచులు తదితర వాటి అమ్మకాలపై మున్సిపల్ కమిషనర్ అంజయ్య వ్యాపారస్థులకు అవగాహన పరుస్తున్నారు. ప్లాస్టిక్ కవర్లలో తీసుకెళ్లే ఆహార పదార్థాలను తింటే క్యాన్సర్ వస్తున్నట్లు తేలింది. ఎస్పీఎం యాజమాన్యం కూడా ప్లాస్టిక్‌తో కలిగే అనర్థాలపై మున్సిపాలిటీలోని పలు వార్డుల్లో అవగాహన సదస్సులు నిర్వహిస్తోంది.

క్యాన్సర్ ముప్పు..

వేడి పదార్థాలను ప్లాస్టిక్ కవర్లలో తీసుకెళ్లి ఆహారంగా తీసుకుంటే జీర్ణకోశ వ్యాధులు, క్యాన్సర్ వ్యాధి వచ్చే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ప్లాస్టిక్ ప్లేట్లు, కప్పులు, గ్లాసులు తదితర వాడకం ఎక్కువవడం వలన ప్లాస్టిక్ కరిగి జీర్ణకోశంలోకి ప్రవేశించి పలు రకాల వ్యాధులకు దారి తీస్తోంది. దీన్ని దృష్టిలో పెట్టుకొని కాగజ్‌నగర్ మున్సిపల్ అధికారులు చిరువ్యాపారుల దుకాణాల్లో ప్లాస్టిక్ కవర్లతో సరుకులు అమ్మరాదని సూచిస్తున్నారు. పట్టణంలోని ఇందిరామార్కెట్, చిన్నమార్కెట్, రాజీవ్‌గాంధీ చౌరస్తాలో చిరువ్యాపారం చేసే వ్యాపారులకు దీనిపై అవగాహణ కల్పించారు. ప్లాస్టిక్ వినియోగం తగ్గించేందుకు కొన్ని యంత్రాలను ఏర్పాటు చేశారు. ఈ యంత్రంలో రూ.5బిళ్ల వేసే బట్ట సంచి వస్తోంది. పట్టణంలో ప్రధాన మార్కెట్‌తో పాటు పలు చోట్ల వీటిని ఏర్పాటు చేశారు.



బట్ట సంచి వెండింగ్ కేంద్రం

ప్లాస్లిక్ సంచులు వాడొద్దని సూచించాం..
-అంజయ్య, కమిషనర్, కాగజ్‌నగర్



ప్లాస్టిక్ సంచులను వాడొద్దని సూచించాం. ప్లాస్టిక్ కవర్లు, సంచులకు ప్రత్యామ్నాయంగా కాగజ్ నగర్‌లో మూడు బట్ట సంచులను వెండింగ్ చేసే సెంటర్లను ఏర్పాటు చేశాం. దీంతో ప్రస్తుతం సగంభారం తగ్గింది. సంచుల్లోనే అధికంగా కొనుగోలు చేస్తున్నారు.

ప్లాస్టిక్‌తో క్యాన్సర్ ముప్పు..
-తూడురు జగదీష్,
సప్లిమెంటరీ ఫుడ్ అడ్వయిజర్



ప్లాస్టిక్ వినియోగిస్తే క్యాన్సర్ వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ప్లాస్టిక్ తయారీకి సంబంధించిన పరిశ్రమల్లో ఈ సమ్మేళనాలు గ్యాస్‌రూపంలో బయటకు వస్తుంటాయి. ఈ గ్యాస్ ద్వారా క్యాన్సర్ వస్తోంది. వేడి పదార్థాలు ప్లాస్టిక్‌లో ఎక్కువసేపు ఉంచి వాటిని తినప్పడు కొంత ప్లాస్టిక్ కరిగి జీర్ణకోశంలో ప్రవేశించే అవకాశం ఉంది. ఇది ఆరోగ్యానికి మంచి కాదు.

గిరిజన కుటుంబాలకు దుప్పట్లు అందజేత



కోయపోచగూడలో దుప్పట్లు పంపిణీ చేస్తున్న నాయకులు

దండేపల్లి, జనవరి 1: దండేపల్లి మండల పరిషత్ అధ్యక్షుడు ఎంపీపీ గడ్డం శ్రీనివాస్ జన్మదినం పురష్కరించుకొని సోమవారం దండేపల్లి మండలం రాజుగూడ పంచాయతీ పరిధిలోని కుంటాలగూడ చెందిన నిరుపేద గిరిజన కుటుంబాలకు దుప్పట్లు పంపిణీ చేశారు. మిత్రులు ఆకుల రాజేందర్, గడ్డం రాంచెందర్, కళ్లెం రాజన్నల ఆధ్వర్యంలో పేద గిరిజన కుటుంబాలకు చలికాలం దృష్టి వారికి దుప్పట్లులను అందజేశామన్నారు. కార్యక్రమంలో సర్పంచు మర్సుకోల లచ్చుపటేల్, ఉప సర్పంచుల ఫోరం మండల అధ్యక్షులు పుట్టపాక తిరుపతి, నాయకులు స్వామి, బాపు, రమష్ నవీన్, రామయ్య, తిరుపతి, శంకర్, శ్రీనివాస్, వెంకటేష్, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

కొత్తూర్‌లో క్రికెట్ పోటీలు ప్రారంభం



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న కాంగ్రెస్ నాయకులు

నెన్నెల, జనవరి 1: నియోజవకర్గ స్థాయి క్రికెట్ పోటీలు సోమవారం కొత్తూరులో ప్రారంభమయ్యాయి. తలండి దుర్గమ్మ-రాములు స్మారకార్థం యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు జలీల్ అహ్మద్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. మెట్‌పల్లి ఎంపీటీసీ దాగం రమేష్, యువ నాయకుడు చీర్ల కిషన్‌రెడ్డి టోర్నీని ప్రారంభించారు. నెన్నెల, భీమారం, కోటపల్లి, వేమనపల్లి, కన్నెపల్లి మండలాలకు చెందిన 40 జట్లు పాల్గొంటున్నాయని నిర్వాహకులు తెలిపారు. విజేతలకు నగదుతో పాటు ట్రోఫీలు అందజేస్తామన్నారు. డీసీసీ సభ్యుడు లావుడ్య రమేష్, సేవాలాల్ సేనా జిల్లా అధ్యక్షుడు గుగ్లోత్ మల్లేష్‌నాయక్, నాయకులు తలండి పోషమల్లు, కొర్తె రవికుమార్, జనార్దన్, బోయిని పోషం, శ్రీనివాస్, అశోక్, భీష్మయ్య, మధూకర్, మహేష్ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా భీమాకోరెగావ్ శౌర్య దివస్



సీసీసీ కార్నర్ వద్ద అంబేద్కర్ విగ్రహానికి పూల మాలలు వేస్తున్న నాయకులు



కాసిపేటలో నివాళులర్పిస్తున్న దళిత, బహుజన సంఘాల నాయకులు

నస్పూర్, జనవరి 1: నస్పూర్ పట్టణంలోని సీసీసీ కార్నర్ వద్ద మాల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సోమవారం బీమా కోరెగావ్ యుద్ధవిజయోత్సవాలను ఘనంగా నిర్వహించారు. యుద్ధంలో మృతిచెందిన అమరులను స్మరిస్తూ కార్నర్‌లోని అంబేద్కర్ విగ్రహనికి పూలమాలలు వేసి నివాళలర్పించారు. సంక్షేమసంఘ నాయకులు మాట్లాడుతూ1 జనవరి1818లో పూణె సమీపంలోని కోరెగావ్ గ్రామంలో పీష్వా, మహర్ సైనికుల మధ్య జరిగిన యుద్ధంలో విజయం సాధించి నందున అప్పటి నుంచి జనవరి1ని శౌర్య దినోత్సవంగా జరుపుకొంటున్నారన్నారు. యుద్ధంలో మృతిచెందిన మహార్ సైనికులకు నివాళులర్పిస్తున్నట్లు తెలిపారు. తెలంగాణ ఎంప్లాయిస్ అసోసి యేషన్ జిల్లా అధ్యక్షుడు దాసరి వెంకటరమణ, మాల సంక్షేమ సంఘం నస్పూర్ పట్టణ అధ్యక్షుడు గోసిక మనోజ్‌కుమార్, నాయకులు దీలిప్, యుంగధర్, కొండరాజయ్య, లింగయ్య,పవన్,శరన్,రమేష్,వెంకటేశ్ పాల్గొన్నారు.

కాసిపేట: భీమాకోరేగావ్ అమరవీరులకు దళిత బహుజన సంఘాలు ఘనంగా నివాళులర్పించాయి. సంఘాల నాయకులు మాట్లాడుతూ వేలాది బ్రహ్మల పీష్వా సైన్యంపై వీరోచిత పోరాటం చేసి అమరులైన వీరులస్ఫూర్తిని కొనియాడారు.విజయ స్థూపం చిత్రపటానికి నివాళులర్పించారు. నాయకులు పల్లె మల్లయ్య, బాపు, గంట సత్యం, దాసరి రాజన్న తదితరులు పాల్గొన్నారు.

మంచిర్యాల కలెక్టరేట్: బీమాకోరేగాం అమరుల స్ఫూర్తిని నిలబెట్టాలని దళిత, బహుజన ఐక్య వేదిక నాయకులు పలిగిరి కనకరాజు పేర్కొన్నారు. బీమాకోరేగాం అమరుల శౌర్యదివస్‌ను పురస్కరించుకొని మంచిర్యాలలోని అమరుల స్థూపం వద్ద నివాళుల ర్పించారు. వారి పోరాటం చరిత్రలో నిలిచిపోతుందని, వారి ఆశయ సాధనకు కృషి చేయాలని కోరారు. నాయకులు రాజేశం, రామ్మూర్తి, మల్లయ్య, సత్యం, తదితరులు పాల్గొన్నారు. సమతా సైనిక్‌దళ్ ఆధ్వర్యంలో బీమాకోరేగాం అమరులకోసం స్థానిక అమరుల స్థూపం వద్ద నివాళులర్పించారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రామ్మూర్తి, షాకీర్, రాజేశ్, తదితరులు పాల్గొన్నారు.



మంచిర్యాలలో నివాళులర్పిస్తున్న దళిత, బహుజన సంఘాల నాయకులు

కుమరం భీం ఆసిఫాబాద్‌లో.. శౌర్య దివస్

ఆసిఫాబాద్, జనవరి 1: పట్టణంలో సోమవారం భీమాకోరెగావ్ సౌర్య దివస్‌ను జైభీం సేన ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేద్కర్‌చౌక్‌లో అమరవీరులకు ఘన నివాళులు అర్పించారు. అనంతరం కమిటీఆధ్వర్యంలో ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కమిటీ ప్రధాన కార్యదర్శి సుధాకర్, గౌరవ అధ్యక్షుడు అశోక్, చరణ్, తదితరులు పాల్గొన్నారు.

వాంకిడి: మండలంలోని ఖమాన, వాంకిడి గ్రామాల్లో శౌర్యదివస్ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా భీమకొరెగాం యుద్ధంలో పేశ్వలపై వీరోచితంగా పోరాడి అసువులు బాసిన మహర్‌వీరులకు శ్రద్ధాంజలి ఘటించి శౌర్యస్థూపానికి నివాళులు అర్పించారు. అనంతరం గౌతమ బుద్ధుడు, అంబేద్కర్ చిత్రపటాలకు వందనం చేశారు. కార్యక్రమంలో అంబేద్కర్ సంఘం నాయకులు జయరాం, సునీల్, విజయ్, శ్యాంరావు, విఠల్, విలాస్, రాజేశ్వర్, సందీప్, ఏఈవో మిలింద్, టేమాజీ, యశ్వంత్‌రావు, మారుతి, కిషన్ పాల్గొన్నారు.

కాగజ్‌నగర్: పట్టణంలో సమత సొసైటీ, బుద్దిస్ట్ సొసైటీఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో భీమా కోరేగావ్ శౌర్యదివస్ వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి దుర్గం విస్తారు, సొసైటీ ప్రధానకార్యదర్శి తిరుపతి, టేమాజీ, గజానన్, మోహన్, తదితరులు పాల్గొన్నారు.



వాంకిడిలో శౌర్యస్థూపానికి నివాళులు అర్పిస్తున్న అంబేద్కర్ సంఘం నాయకులు



ఆసిఫాబాద్‌లో నివాళులు అర్పిస్తున్న జైభీం సేన సభ్యులు



కాగజ్‌నగర్‌లో శౌర్యదివస్ వేడుకల్లో పాల్గొన్న నాయకులు

అవగాహన కల్పించినా.. రాని మార్పు

● కొనసాగుతున్న వేట

● బలవుతున్న మూగజీవాలు

● కొన్ని సందర్భాల్లో మనుషుల ప్రాణాలమీదకు..



గ్రామాల్లో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న అటవీ శాఖాధికారులు(ఫైల్)

సిర్పూర్(టి), జనవరి 1: ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా వన్యప్రాణులకు హాని కలిగించవద్దని ఊరూరా విస్తృతంగా అవగాహన కల్పించినా వేటగాళ్లలో ఎలాంటి మార్పు రావడంలేదు. ప్రత్యేకంగా గ్రామీణ ప్రాంతాల్లో ఈ అవగాహనతో రెండు, మూడునెలలు ప్రశాంతంగా ఉన్నా.. మళ్లీ వేటగాళ్లు రెచ్చిపోయి వన్య ప్రాణుల వేట మొదలు పెట్టారు. మాసం, విలువైన చర్మం, కొమ్ములు, దంతాలు బ్లాక్‌మార్కెట్‌లో అమ్ముకోవడానికి అడవులలో సోలార్ బ్యాటరీ, కరెంటు తీగలను అమర్చి దుప్పులు, ఇతర వన్య ప్రాణులను హత మార్చి సొమ్ము చేసుకుంటున్నారు. ఒకవైపు అటవీశాఖాధికారులు అడవులు, వన్యప్రాణి రక్షణకు కోట్ల రూపాయల నిధులు కేటాయిస్తోంది. వాటి రక్షణకు మౌలిక సదుపాయాలు కల్పిస్తోంది. అయినా గ్రామీణ ప్రజల్లో ఎలాంటి మార్పురావడం లేదన్న ఆరోపణలున్నాయి. ఈ క్రమంలోనే సిర్పూర్(టి)రేంజ్ పరిధిలో చింతకుంట గ్రామంలో 15మంది కలిసి రెండు దుప్పులను హతమార్చగా వారిని అటవీశాఖాధికారులు పట్టుకున్నారు. వారిపై కేసు నమోదుచేసి జిల్లా జైలుకు తరలించారు. ఇదే తరహాలో 2021సంవత్సరంలో కూడా అడవిలో విద్యుత్‌తీగలు అమర్చి వన్యప్రాణులను హతమార్చడానికి వెళ్లి అవే తీగలకు తగిలిగ్రామానికి చెందిన లావుడే నరేష్ మృతి చెందాడు. ఇప్పటికైనా గ్రామస్థులు మారాలని అటవీ శాఖాధికారులు కోరుతున్నారు.



దుప్పులను హతమార్చి పట్టుబడిన వారితో అటవీ అధికారులు(ఫైల్)

రేపు ఎమ్మెల్యే పర్యటన

జైపూర్, జనవరి 1: ఈ నెల 3న మండలంలో ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి పర్యటించనున్నట్లు ఎంపీడీవో సత్యనారాయణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పౌనూరు, బెజ్జాల గ్రామాల్లో నిర్వహించే ప్రజాపాలన గ్రామసభల్లో పాల్గొంటారని పేర్కొన్నారు.

టీబీజీకేఎస్ ప్రస్థానంపై నీలినీడలు

ఇతర యూనియన్‌లో చేరేందుకు నాయకుల ఆసక్తి

మందమర్రి టౌన్, జనవరి 1: సింగరేణిలో ఈనెల27న జరిగిన7వ దఫా గుర్తింపు సంఘం ఎన్నికల్లో కొన్ని ఏరియాల్లో మాత్రమే టీబీజీకేఎస్ పోటీ చేసింది. ఐదు ఏరియాల్లో ఏఐటీయూసీకి మద్దతునిచ్చింది. ఈ ఎన్నికల్లో ఏఐటీయూసీ ఐదు ఏరియాలలో గెలిచి గుర్తింపు సంఘంగా ఎన్నికైంది. ప్రతిపక్ష సంఘంగా కాంగ్రెస్ పార్టీ అనుబంధ ఐఎన్‌టీయూసీ అవతరించింది. 2003 జనవరి 27న దివంగత ప్రొఫెసర్ జయశంకర్ నేతృత్వంలో తెలంగాణ బొగ్గుగని కార్మికసంఘం ఆవిర్భవించి జాతీ య సంఘాలకు దీటుగా పని చేసింది. 2012లో జరిగిన ఎన్నికల్లో గుర్తింపు సంఘంగా ఎన్నికైంది. అనంతరం అగ్రనాయకత్వంలో విభేదాల వల్ల సంఘం రెండుగా చీలింది. కెంగర్ల మల్లయ్య, మిర్యాల రాజిరెడ్డిలు ఇద్దరు వర్గాలుగా ఏర్పడి కోర్టుకెక్కారు. తిరిగి నాయకత్వం కోసం మళ్లీ ఎన్నికలు జరగడంతో మిర్యాల రాజిరెడ్డి వర్గం విజయం సాధించింది. అప్పటి నుండి 2017 వరకు గుర్తింపు సంఘంగా కొనసాగింది. అనంతరం 2017లో జరిగిన ఎన్నికల్లో రెండో సారి ఎన్నికైంది. దశాబ్ద కాలంగా సింగరేణిలో గుర్తింపు సంఘంగా పని చేసిన టీబీజీకేఎస్ దాని మనుగడే ప్రశ్నార్థకంగా తయారైంది. నవంబరు 30న రాష్ట్రంలో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓటమి కావడంతో సింగరేణిలో ఆ యూనియన్ మసకబారింది. గుర్తింపు ఎన్నికల్లో పోటీకి యూనియన్ గౌరవ అధ్యక్షురాలు కవిత అంగీకారం తెలపకపోవడంతో నాయకులు వెంకట్రావ్, రాజిరెడ్డి, మల్లయ్యలు రాజీనామా చేశారు. అనంతరం మరుసటి రోజే పోటీలో ఉంటామని, అనేక హక్కులు సాధించిన టీబీజీకేఎస్‌ను గెలిపించాలని గౌరవాధ్యక్షురాలు పిలుపునిచ్చారు. అయినప్పటికీ కొన్ని ఏరియాల్లో నాయకులు ఐఎన్‌టీయూసీలో చేరగా కొన్ని ఏరియాల్లో ఏఐటీయూసీకి మద్దతు పలికారు. ఎన్నికల్లో టీబీజీకేఎస్ ప్రభావం చూపలేకపోయింది. సింగరేణిలోని 11 ఏరియాల నాయకులు పెద్ద మొత్తంలో ఐఎన్‌టీయూసీ, ఏఐటీయూసీలో చేరడానికి సిద్ధమవుతున్నట్లు తెలుస్తుంది.

నూతన లక్ష్యాలను నిర్దేశించుకుని పనిచేయాలి

● ఎస్పీ సురేష్‌కుమార్



పదోన్నతి పొందిన ఆఫీసర్‌కు స్టార్ పెడుతున్న ఎస్పీ సురేష్‌కుమార్

ఆసిఫాబాద్, జనవరి 1: నూతన లక్ష్యాలను నిర్దేశించుకుని పనిచేయాలని ఎస్పీ సురేష్‌కుమార్ అన్నారు. పోలీసు హెడ్‌క్వార్టర్స్‌లో నూతనసంవత్సర వేడుకలు నిర్వహించి కేక్ కట్‌చేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడిచిన సంవత్సరం పోలీసుశాఖలో ఎన్నో నూతన ఒడవడికలు, అధునాతన సాంకేతికత పరిజ్ఞానానికి శ్రీకారం చుట్టామన్నారు. అవి సిబ్బంది పూర్తిస్థాయి విధి నిర్వహణకు ఎంతో దోహదపడ్డాయన్నారు. లాఅండ్‌ఆర్డర్ పోలీసులు నిత్యం ప్రజల మధ్య ఉంటూ వారి సమస్యలు పరిష్కరిస్తూ ప్రజలతో మంచి సంబంధాలను కలిగిఉండే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో డీఎస్పీలు వెంకటరమణ, కరుణాకర్, రమేష్, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

పదోన్నతితో బాధ్యత పెరుగుతుంది..

జిల్లాలో సివిల్ విభాగంలో హెడ్‌కానిస్టేబుల్‌గా పనిచేస్తూ ఏఎస్సైలుగా పదోన్నతి పొందిన బి రమేష్, కె అనిల్‌కుమార్, చంద్రశేఖర్, సాయిబాబా, జమాల్ అహ్మద్, వేణుగోపాల్‌ను ఎస్పీ అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదోన్నతితో బాధ్యత కూడా పెరుగుతుందన్నారు. బాధ్యతను క్రమశిక్షణాయుతంగా నిర్వహిస్తూ ప్రజలలో పోలీసు శాఖపట్ల నమ్మకాన్ని, గౌరవాన్ని పెంచే విధంగా పనిచేయాలని అన్నారు.

అమ్ముకుందామా.. ఆగుదామా..?

పత్తి రైతుల్లో అయోమయం



జిల్లా వ్యాప్తంగా 3.30లక్షల ఎకరాల్లో పత్తి పంట

జిల్లా వ్యాప్తంగా వానాకాలం సీజన్‌లో 4.40లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగవుతుండగా 3.30లక్షల ఎకరాల్లో పత్తి పండిస్తున్నారు. ఎకరా పత్తి సాగుకు రూ.20నుంచి 30వేల దాకా పెట్టుబడి అవు తుంది. ఎకరాకు సుమారు 10క్వింటాళ్ల పత్తి దిగుబడి రావాల్సి ఉండగా ఈసారి కేవలం 4నుంచి 5క్వింటాళ్ల దిగుబడి కష్టమవు తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సాగుకు ఏటా వ్యయం పెరుగుతున్నా.. దిగుబడి తగ్గు తూ వస్తోందని ప్రభుత్వం మద్దతు ధర పెంచి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.



గిట్టుబాటు ధర కల్పిస్తే బయటపడతాం..

గుర్నులే మెంగాజీ, రైతు

పంట ఒకేసారి చేతికి వస్తుందన్న ఆశతో సాగుచేశాను. వాతా వరణ పరిస్థితులవల్ల పెట్టుబడి పెరిగి, దిగుబడి అంతంత మాత్రంగా వచ్చింది. ఎకరాకు నాలుగు క్వింటాళ్లు డిగుబడి కూడా రాలేదు. ప్రభుత్వం గిట్టుబాటు ధరను రూ.10వేలకు పెంచి రైతులను ఆదుకోవాలి.

వాంకిడి, జనవరి 1: సాగునీటి వనరులు అంతంత మాత్రంగా ఉన్న ప్రాంతాల్లో రైతును కాస్తో కూస్తో ఆదుకుంటున్నది పత్తి సాగే. తాజాగా పత్తి తీయడం మొదలవగా, ప్రభుత్వం జిల్లా వ్యాప్తంగా భారత పత్తి సంస్థ(సీసీఐ) ద్వారా పత్తి కొనుగోళ్ల ప్రారంభించింది. ఇటీవల కురిసిన తుఫాన్ వర్షాలతో పత్తి పంట తీవ్రంగా దెబ్బతింది. దిగుబడి తగ్గి పత్తికి డిమాండ్ పెరిగినా ధర మాత్రం గతంతో పోలిస్తే చాలా తక్కువగా ఉంది. ఈ పరిస్థితిలో పత్తిని ఇప్పుడు అమ్మాలా? లేదా మరికొన్ని రోజులు ఆగాలా అనే సంశయంలో రైతులు ఉన్నారు. ఎన్నికల ఫలితాలు వెలువడిన మరుసటి రోజు నుంచే సీసీఐ ఆధ్వర్యంలో పత్తి కొనుగోళ్ల ప్రారంభించారు. ఎన్నికల సమయంలో ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో భారీ నష్టం జరిగినట్లు రైతులు పేర్కొంటున్నారు. కొత్త ప్రభుత్వం కొలువు దీరితే పత్తి రైతులను పట్టించుకుటుందేమోనని ఎదురు చూస్తుండగా ధర తగ్గుముఖం పడుతుండడంతో రైతులకు నిరాశే మిగిలుతోంది.

అక్టోబరులో రూ.7,400...నేడు రూ.7,020

అక్టోబరు మొదట్లో ప్రైవేటు వ్యక్తులు పత్తిని క్వింటాకు రూ.7400 చెల్లించి రైతుల నుంచి కొనుగోలు చేశారు. ఈ ధరలు అక్టోబరు చివరివరకు కొనసాగాయి. దిగుబడి తగ్గడంతో ధరలు పెరుగు తాయని ఆశపడ్డ రైతులకు చివర్లో చుక్కెదురైంది. పత్తి విత్తనానికి ధర పడిపోవడంతో ప్రైవేటు వ్యాపారులు చేతులెత్తేసి ధరను పెంచ లేమని ప్రకటించడంతో క్వింటా ధర రూ.6800కు పడిపోయింది. ఇక రైతులు చేసేది ఏమీలేక సీసీఐ ఏర్పాటు చేసిన పత్తి కొనుగోళ్ల కేంద్రాలకు వెళ్లి పత్తిని అమ్ముకుంటున్నారు.

సీసీఐ ధర ఆకర్షణీయంగా ఉన్నా..

ప్రస్తుతం సీసీఐలో నాణ్యమైన పత్తి క్వింటాల్‌కు రూ.7020 వరకు ధర పలుకుతోంది. గతంలో ఇదే సమయంలో గరిష్ఠంగా రూ. 9800 ఉంది. ప్రైవేట్ వ్యాపారులు ప్రస్తుతం ఉన్న ధర రూ.6800 కొనుగోలు చేసేందుకు సిద్ధంగా ఉన్నా రైతులు ప్రైవేట్ వ్యాపారులకు విక్రయించేందుకు సిద్ధంగా లేరు. ఈ ఏడాది వర్షాలు కురవడంతో పెట్టుబడులు అధికమయ్యాయని కనీసం మంచి ధర వస్తే లాభాలు లేకున్నా నష్టం లేకుండా బయటపడతామని రైతులు అభిప్రాయప డుతున్నారు. ఇలాంటి సమయంలో ఇప్పుడు అమ్మడం కన్నా కొద్ది రోజులు వేచి చూస్తే ఫలితం ఉంటుందేమోననే ఆశ ఉన్నప్పటికి గత సంవత్సరం జరిగిన పరిణామాలతో రైతులు భయపడుతున్నారు.

గత సంవత్సరం కింటా పత్తికి రూ. 9800 పలుకుతున్న సమ యంలో ఆశపడిన రైతులు అప్పుడు అమ్ముకుండా పత్తిని నిల్వ చేశారు. రెండు నెలల అనంతరం ఒకేసారి పత్తికి డిమాండ్ తగ్గడంతో రూ.7200కు పడిపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. ప్రస్తుతం అలాంటి అనుమానాలే రైతులను వెంటాడుతున్నాయి. వేచి ఉంటే పత్తిని నిల్వ చేయడం ఒక సమస్య కాగా, తరుగు పెరుగుతుందని రైతులు భయపడుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో పత్తిని అమ్ముదామా? ఆగుదామా? అన్న సందిగ్ధంలో రైతులు ఉన్నారు.

ఆదివాసీ సమస్యల పరిష్కారానికి కృషి



ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న భీం మనుమడు సోనేరావు

ఆసిఫాబాద్, జనవరి 1: ఆదివాసీల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే కోవ లక్ష్మి అన్నారు. సోమవారం కుమరం భీం మనుమడు సోనేరావు ఆదివాసీ సంఘాల నాయకులతో కలిసి ఎమ్మె ల్యేను మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆదివాసులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆదివాసీల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి సారిస్తానని అన్నారు. కార్యక్రమంలో కోయ పుణ్డెం గోండి ధర్మ రాష్ట్ర ప్రధానకార్యదర్శి ఆత్రం ఆనంద్‌రావు, ఆదివాసీ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ప్రధాని మోదీ కృషితోనే స్కిల్ సెంటర్లు

● ఎమ్మెల్యే హరీష్‌బాబు



సెంటర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే హరీష్ బాబు

కాగజ్‌నగర్, జనవరి 1: ప్రధాని మోదీ కృషితోనే స్కిల్ సెంటర్లు అభివృద్ధికి బాటలు వేసినట్లు ఎమ్మెల్యే హరీష్‌బాబు అన్నారు. సోమవారం నవోదయ విద్యాలయంలో స్కిల్ సెంటర్‌ను ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ ప్రధానిమోదీ స్కిల్‌డెవలప్ సెంటర్ల ద్వారా ఉపాధి అవకాశాలు పెరుగుతున్నాయన్నారు. ఉమ్మడి జిల్లాలోని విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మిగితా సమస్యలు పరిష్కరించేందుకు తనవంతు కృషి చేస్తానన్నారు. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని విద్యార్థుల మధ్య కేక్‌కట్ చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ చక్రపాణి, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న విద్యార్థుల ఆర్ట్స్



విద్యార్థులు తయారు చేసి కళాకృతులు

కాగజ్‌నగర్, జనవరి 1: కాగజ్‌నగర్ కృష్ణవేణి పాఠశాలలో సోమవారం ఆర్ట్స్ గ్యాలరీని నిర్వహించారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్స్ సువర్ధన్, జియాహుల్‌హక్ మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగిన సృజనాత్మకతను వెలికితీసేందుకు ఇటు వంటి కార్యక్రమాలు ఎంతగానో ఉపయోగపడుతాయన్నారు. కార్యక్రమంలోపాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం కేక్ కట్ చేసి నూతన సంవత్సర సంబరాలు జరుపుకున్నారు.

ఆలయంలో అయ్యప్ప పడిపూజ



పడిపూజలో పాల్గొన్న భక్తులు

ఆసిఫాబాద్‌రూరల్, జనవరి 1: పట్టణంలోని బ్రహ్మణవాడ కేశవనాథ ఆలయంలో ఆదివారం రాత్రి అయ్యప్ప పడిపూజ నిర్వహించారు. అనంతరం అయ్యప్పస్వాములు చేసిన పేటతుల్లి ఆకట్టుకుంది. అనంతరం పదునెట్టబండిపై దీపాలు వెలిగించారు. కార్యక్రమంలో గురుస్వాములు నళిని మోహన్, అశోక్, శ్రీనివాస్, వెంకట్‌గౌడ్, వేణుగోపాల్, సంతోష్, చంద్రమోహన్, వినాయక్, సంతోష్, బాలరాము, రాజబాబు తదితరులు పాల్గొన్నారు.

నేడు రాములోరి అక్షింతల శోభాయాత్ర

కౌటాల, జనవరి 1: అయోధ్య రామ మందిర శ్రీరాముని అక్షింతలను మంగళవారం మండల కేంద్రంలో శోభాయాత్ర నిర్వహించనున్నట్లు శ్రీరామ మండల కమిటీ సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు తలోడి హనుమాన్ మందిర్ నుంచి ఈ శోభాయాత్ర ప్రారంభమై మండలకేంద్రం వరకు జరుగుతుందన్నారు. అనంతరం అంక్షింతలను మండల కేంద్రంలోని శ్రీకోదండ రామాలయంలో ఉంచనున్నట్లు తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

కోడి పందెంరాయుళ్ల అరెస్టు

దహెగాం, జనవరి 1: మండలం కుంచవెల్లి గ్రామశివారులో పదిమంది కోడి పందెంరాయుళ్లను అరెస్టు చేసినట్లు ఎస్సై సనత్‌కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. పక్కా సమాచారం మేరకు ఆదివారం రాత్రి కోడి పందేల స్థావరంపై దాడిచేసి పది మందిని పట్టుకుని రెండు కోడిపుంజులు, వెయ్యిరూపాయలు స్వాధీనపర్చుకున్నట్లు తెలిపారు.

ఘనంగా నూతన సంవత్సర వేడుకలు

ఆసిఫాబాద్, జనవరి 1: ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో సోమవారం నూతన సంవత్సర వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపే విధంగా మహిళలు ఇళ్ల లోగిళ్ల ముందు రంగురంగుల ముగ్గులను వేశారు. నూతన సంవత్సరం సందర్భంగా ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. చర్చిలలో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. దస్నాపూర్ చర్చిలో నిర్వహించిన కార్యక్రమానికి ఎంపీపీ మల్లికార్జున్, సహకార చైర్మన్ అలీబీన్ అహ్మద్ పాల్గొని కేక్ కట్ చేశారు.

కాగజ్‌నగర్: కాగజ్‌నగర్ పట్టణంలో నూతన సంవత్సర వేడుకలు ఆదివారం రాత్రి ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా చిన్నారులు, యువకులు కేరింతలు కొడుతూ సంబరాలు జరిపారు. అలాగే వివిధ పాటలపై డ్యాన్సులు చేశారు. కేక్‌లు కట్ చేశారు. మార్కెట్లో ఎమ్మెల్యే హరీష్‌బాబు ప్రజలందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. 2023 తీపిగుర్తులో గడిచిందన్నారు. ప్రజల సమస్యలను పరిష్కరించి అభివృద్ధి పథంలో నడిపిచేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. డీఎస్పీ కరుణాకర్, సీఐ బుద్ధెస్వామి ఆధ్వర్యంలో గట్టి బందోబస్తు నిర్వహించారు.

బెజ్జూరు/ పెంచికలపేట/ చింతలమానేపల్లి/ సిర్పూర్(టి)/కౌటాల: మండలాల్లో నూతనసంవత్సర వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. పాత సంవత్సరానికి వీడ్కోలు పలుకుతూ కొత్త సంవత్సరాన్ని స్వాగతించారు. యువకులు అర్ధరాత్రి కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. అలాగే ఉదయం ఇళ్ల ముందు రంగు రంగులతో ముగ్గులు వేశారు.



ఎమ్మెల్యే కోవ లక్ష్మిని సన్మానించి శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

ప్రముఖుల ఇళ్లలో..

ఆసిఫాబాద్ రూరల్: కలెక్టర్ హేమంత్ బోర్కడే, ఎమ్మెల్యే కోవ లక్ష్మి, జడ్పీటీసీ నాగేశ్వర్ రావుతో పాటు ప్రముఖుల ఇళ్లలో నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయానికి అదనపుకలెక్టర్ వేణు, కలెక్టరేట్ ఏవో రఫతుస్సేన్, తహసీల్దార్ భౌమిక్ తదితరులు వచ్చి కలెక్టర్‌కు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అలాగే ఎమ్మెల్యేను కలవడానికి ఉదయం నుంచి వచ్చిన నాయకులతో ఆమె ఇళ్లంతా కోలాహలంగా మారింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను పలువురు సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ మల్లికార్జున్, వైస్‌ఎంపీపీ మంగ, పెంటయ్య, సర్పంచ్ భీమేష్, అబ్దుల్లా, బాలేష్‌గౌడ్, వెంకన్న పాల్గొన్నారు.



ఆసిఫాబాద్‌లో చర్చిలో కేక్ కట్ చేస్తున్న ఎంపీపీ మల్లికార్జున్



కాగజ్‌నగర్‌లో వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులు

క్రీడలతో మానసికోల్లాసం

కౌటాల, జనవరి 1: క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని సర్పంచ్ రేణుక అన్నారు. సోమవారం మండలంలోని వీర్దండి గ్రామంలో శ్రీ గజానన్ పోచాని పెందోర్ స్మారక ఒకరోజు గ్రామస్థాయి వాలీబాల్ పోటీలు నిర్వహించారు. గ్రామస్థాయిలో క్రీడాకారుల్లో క్రీడాస్ఫూర్తిని పెంపొందించేందుకు ఈపోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకుడు రాజు తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు నాందేవ్, మధుకర్, నాయకులు వంశీ పాల్గొన్నారు.

క్రీడాస్ఫూర్తిని చాటాలి

● ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు



బ్యాటింగ్ చేసి క్రీడలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే హరీష్‌బాబు

దహెగాం, జనవరి 1: క్రీడాకారులు క్రీడాస్ఫూర్తిని చాటాలని ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు అన్నారు. సోమవారం మండలంలోని పీపీరావు కాలనీలో మాజీ ఎమ్మెల్యే పురుషోత్తమరావు స్మారక క్రికెట్ టోర్నమెంట్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లా డుతూ క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. స్నేహ సంబంధాలు పెంపొందించుకోవచ్చన్నారు. ఎమ్మె ల్యేగా గెలుపొంది గ్రామానికి తొలిసారిగా రావడంతో గ్రామ స్థులు ఆయనను ఘనంగా సన్మానించారు. అదే విధంగా ఆయన మేకలగూడలో బోనాల కార్యక్రమంలో పాల్గొని భీమన్న ఆలయంలో మొక్కులు చెల్లించుకున్నారు. మండల కేంద్రంలోని శివాలయంలో మొక్కులు చెల్లించుకున్నారు.

అయోధ్య పూజిత అక్షింతల పంపిణీ

ఆసిఫాబాద్ రూరల్, జనవరి 1: మండలంలోని గుండి గ్రామంలో అయోధ్య రామ్ మందిర పూజిత అక్షింతలకు హనుమాన్ భక్తులు, ప్రజలు ఘనంగా శోభాయాత్ర నిర్వహించి పంపిణీచేశారు. కార్యక్ర మంలో సర్పంచ్ అరుణ, మాజీసర్పంచ్ దత్తు, ఏసీఎం డైరెక్టర్ శ్యాంరావు తదితరులు పాల్గొన్నారు.



ఆర్కే6 ఉద్యోగులకు అభినందన



ఉద్యోగులను అభినందిస్తున్న ఏజెంట్ ఏవీ రెడ్డి

శ్రీరాంపూర్, జనవరి 1: ఆర్కే6గనిలో ఎస్‌డీఎల్ యంత్రాలతో సింగరేణిలోనే అత్యధిక ఉత్పత్తి సాధించిన సందర్భంగా ఉద్యోగులను గ్రూప్‌ఏజెంట్ ఏవీ రెడ్డి సోమవారం అభినందించారు. ఇదే ఒరవడితో ముందుకు సాగాలని సూచించారు. కార్యక్రమంలో మేనేజర్ ఈ తిరుపతి, రక్షణాధికారి కెశ్రీనివాస్, సంక్షేమాధికారి సునీల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఎంఎస్ అధికార ప్రతినిధిగా జీవన్‌జోయల్

శ్రీరాంపూర్, జనవరి 1: హెచ్‌ఎంఎస్ అధికార ప్రతినిధిగా జీవన్ జోయల్‌ను నియమిస్తూ ఆ యూనియన్ రాష్ట్రఅధ్యక్షుడు రియాజ్ అహ్మద్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. జీవన్ జోయల్ సింగరేణి కార్మికుల సమస్యల పరిష్కారానికి ఎంతో కృషి చేస్తున్నారని, ఆయన కృషిని గుర్తించి ఈ నియామకం చేపట్టామని అందులో పేర్కొన్నారు.

గనులపై నూతన సంవత్సర సంబరాలు

శ్రీరాంపూర్, జనవరి 1: సింగరేణి గనులు, విభాగాలలో సోమవారం నూతన సంవత్సర సంబరాలు నిర్వహించారు. ఆర్కే 8 డిస్పెన్సరీ, శ్రీరాంపూర్ ఓసీపీ, జీఎం కార్యాలయంలో జీఎం బి సంజీవరెడ్డి కేక్ కట్‌చేసి ఉద్యోగులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ ఆర్థికసంవత్సరం ఉత్పత్తి లక్ష్యాన్ని సాధించేందుకు కృషిచేయాలని సూచించారు. లక్కీడ్రాలో జీఎం బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఎస్‌వోటుజీఎం కె రఘుకుమార్, ఎజీఎం(ఫైనాన్స్) మురళీధర్, డీజీఎంలు అరవిందరావు పాల్గొన్నారు.



డిస్పెన్సరీలో కేక్ కట్ చేస్తున్న జీఎం

జీఎంకు శుభాకాంక్షల వెల్లువ..

శ్రీరాంపూర్ ఏరియా జీఎం బి సంజీవరెడ్డికి పలుసంఘాలు, యూనియన్ల నాయకులు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఏఐటీయూసీ రాష్ట్రఅధ్యక్షుడు వి సీతారామయ్య, ఉప ప్రధానకార్య దర్శులు కె వీరభద్రయ్య, ముస్కెసమ్మయ్య, బ్రాంచ్ కార్యదర్శి బాజీసైదా, ఉపాధ్యక్షుడు కొట్టె కిషన్‌రావు, ఎస్సీ,ఎస్టీ ఉదోగుల సంఘ (1630/1982) ఉపాధ్యక్షుడు నెలబోయిన కుమార్, ఏరియాలైజన్‌అధికారి కిరణ్‌కుమార్, డీజీఎం(ఐఈడీ)చిరంజీవులు, ఏరియా కార్యదర్శి సదిరం రాజేంద్రప్రసాద్, పీటీ బాపయ్య, తదితరులు జీఎంకు పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు.

కాంట్రాక్టు ఉద్యోగి కుటుంబానికి చేయూత

శ్రీరాంపూర్ ఆర్కే8 డిస్పెన్సరీ ఉద్యోగులు తలో చేయి వేసి కాంట్రాక్టు కార్మికుడికి ఆర్థిక సహాయం చేశారు. కార్యాలయంలో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగిరాజేందర్ భార్య క్యాన్సర్ బారినపడగా ఆమె వైద్య ఖర్చుల నిమిత్తంకార్యాలయంలో పని చేస్తున్న ఉద్యోగులు తలాకొంత జమచేశారు. రూ.21,100జమ కాగా, ఆ మొత్తాన్ని జీఎం బిసంజీవరెడ్డి చేతులమీదుగా రాజేందర్ దంపతులకు అందించారు. ఉద్యోగులను జీఎం అభినందించారు. కార్యక్రమంలో ఎస్‌వోటు జీఎం కెరఘుకుమార్, ఎజీఎం(ఫైనాన్స్) మురళీధర్, డీజీఎం(సివిల్) ఆనంద్ కుమార్ పాల్గొన్నారు.

ప్రమాదరహిత రీజియన్‌గా బెల్లంపల్లి

శ్రీరాంపూర్, జనవరి 1: గడిచిన ఏడాది ప్రమాదరహితంగా బెల్లంపల్లి రీజియన్ నిలిచిందని శ్రీరాంపూర్ జీఎం బి సంజీవరెడ్డి అన్నారు. కాన్ఫరెన్స్‌హాలులో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. శ్రీరాంపూర్ ఏరియాను పలుఅవార్డులు వరించినట్లు తెలిపారు. కేంద్ర కార్మికశాఖ ఇచ్చేరేటింగ్‌లోఎస్‌ఆర్పీ1గనికి 5స్టార్ రేటింగ్ లభించిందన్నారు. ఇందారం 1ఏగనికి ఉత్తమమ్యాన్‌రైడింగ్ అవార్డు, శ్రీరాంపూర్ ఓసీపీకి ఉత్తమఓసీపీ అవార్డులు వచ్చాయన్నారు. ఏరియాలో387మందికి కారుణ్య నియామకం ద్వారా ఉద్యోగాలు, 46మందికి ఎల్‌ఎస్‌పి, నలుగురికి ఎంఎంసీ ఇచ్చామన్నారు. ఆర్థికసంవత్సరం చివరినాటికి లక్ష్యాన్ని చేరుకుంటామన్నారు.కార్యక్రమంలో ఎస్‌వోటు జీఎం కె రఘుకుమార్, డీజీఎంలు అరవిందరావు, చిరంజీవులు పాల్గొన్నారు.